ఈ వారం కథ



పోటు

_బడబాగ్ని శంకరరాజు

"ఒరే! కల్లాలోడా! నీకిదేం పోయే గాలంరా! నా మడి గెనాన్ని దున్నేస్తాండావు" అన్న పెద్ద రైతు వెంకట్రామయ్య కొడుకు సుబ్రమణ్యం మాటలతో కూతురి పెళ్లి గురించి ఆలోచనల నుంచి తేరుకొన్నాడు కల్లాల రామయ్య.

నిన్నటి రోజున అయిపోవస్తున్న చనగ తండు కోటా తగ్గించి, జొన్న సొప్ప మేతగా ఏసినందుకు కోపగించుకున్నాయా అన్నట్లు మడకని పక్క కయ్యలోకి లాక్కుపోతున్న దేశ పెద్దులను చూసి తనలో తాను గుంభనంగా నవ్వుకొని –

"ఏమయ్యా ముగరాజా! 'చనగతండు బండెడు బదులీవయ్యా' అని మంగలారం సంతలో అడిగితే ఇనిపించుకోకుండా ఎమ్.ఎల్.ఎ. లెవలీలో కద్దరు సొక్కాని మోచేతుల కాడికి ఎగదోసి అసెంబిలీలో గొడవకు బయలుదేరుతున్నోడిలా ఏడికో బిరబిరా ఎలిపోతివి. కదుపు కాల్నోటికి ఇది మనోడి మడి, పక్కోడిమడి అని ఆలోసించే ఆ మాత్రం ఓపిక యాడుంటాది సెప్పు అబోడా! అయినా తెల్లార్తో నువ్వేందీ ఇట్టా ఎల్లవారొచ్చినావు. మడికయ్యలో ఏమన్నా కోల్లపారం గానీ పెడతావా ఏంది?" అన్నాడు రామయ్య.

పదో తరగతి పరీక్ష ఐదుసార్లు తప్పాక కోడిపిల్ల దగ్గర మంఛీ కోడె దూడల వరకూ దేన్నైనా కొని కొన్నాళ్ళు మెపి మారు బేరానికి అమ్ముకొనే స్వయం ఉపాధి చేపట్టాడు సుబ్రమణ్యం. 'పాతికేళ్లకే ప్రపంచాన్ని కొనేసే తెలివి తేటలు అబ్బాయిని' అనుకొనే ఊళ్ళో వాళ్ళు అందరూ ముద్దుగా 'ముగరాజా' అనే పిలుస్తారు. ఎవరి వల్లయినా పైసా ఆదాయం వస్తుంది అనిపిస్తే ముగరాజు కాదుగదా 'పెంటరాజా!' అని పిలిచినా విని సహించగలిగేంత మానధనుడు'.

"అయితే చనగతండు ఇవ్వలేదని నా మడిని నీ మడి కయ్యలో కలిపేసుకొంటావా ఏంది కల్లాలోడా! మాట మీద నిలబడే వాడివి కదా అని నమ్మకంతో నా పెంతవ లేకున్నా – పెద్ద పండక్కు అల్లుడి మర్యాదలు సెయ్యలేదని మాట్లాడ్డమే మానేసిన నేను, మల్లా నీ కోసమని మా మామగారింటికి సిగ్గుసెడి పోయి డబ్బులు తెచ్చి ఇస్తిని. ఇప్పడేమో నీ యవ్వారం సూస్తాంటే నా నెత్తిమీద సెయ్యి బెట్టేట్టుండావే" రామయ్యపంట బెట్టిన టమోటా తోటలోంచి మాంచి సైజు పండ్లను కోసి సైపంచలో వేసు కొంటూ అన్నాడు ముగరాజు.

"అదేందబ్బోడా అట్టాంటి మాటలంటావు! నీకు బాకీ లేదు పో!' అని నేనెప్పడైనా అన్నానా. అట్లా అంటే వచ్చే జలమలో గాడిద కడుపున పుట్టనా! నాలో నేనే మా బతుకు బాధల గురించి ఇసారించు కొంటూ కొంచం ఏమార్నా. ఈ కొల్లబోయిన కోడెలు నీ గెనె మేపు నాగల్ని లాగేశాయి. ఆ మాత్రానికే ఏదో అక్రమం జరిగిపోయినట్టు అగాయితం సేస్తాండావు. అయినా ఏ మాట కాడ ఆ

14-6-91 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

మాట మాటాడకుండా ఎప్పుడో వచ్చే చనగపంట కాలానికి తీర్చాల్సిన బాకీ మాట ఇప్పుడెందుకంట? అప్పు తిసుకొని నాలుగు నెలలు కూడా కాలేదే!'' దేశపు కోడెల కంటుకొన్న బురదను నీటి మడుగులో కడుగుతూ అన్నాడు కల్లాల రామయ్య.

''అదేదో సినిమా పాటలో సెప్పినట్లు 'ఏ నిముసానికి ఏమి జరుగునో ఎవరూహించెదరూ' అని చెప్పినట్లుగా మా ఆడదానికి ఆ మాయదారి కడుపునొప్పి ఇప్పుడే దాపురిస్తుందని నేనూహించానా. నిన్నింతలోనే అప్పు సెల్లించమని అడుగాల్సొస్తుందని నేనేమన్నా కలగన్నానా. ఎగువ పల్లెలో ప్రజలు పది వేల రూపాయల మీద చెల్లించిన వడ్డీ డబ్బంతా ఆ డాక్టర్ల ఎదాన గొడితి. అయినా జబ్బు తగ్గలా. సివరికి ఏలూరు పెద్దాస్పత్రికి తీసుకుపోదామనుకొన్నా. మరి డబ్బులో! మల్లా చనగపంట వచ్చేదాకా ఎవరూ అప్పులు సెల్లించరాయె'' అని సత్తు బేసిన్‌లో మద్యానం సంగటి తెస్తున్న రామయ్య కూతుళ్లను సూసి టక్కున ఆపాడు.

నాసిరకం టెర్లిన్ చీరను కట్టుకొన్న పెద్దపిల్ల, చిరుగుల జార్జెట్ పైట వేసుకొన్న చిన్న పిల్ల - ఎగుడు దిగుడు గెనాలు దూకుతున్నట్లు కుదుపులతో దిగుతూ వస్తున్న వారిని - ''తలకోన జలపాతంలానూ, తను ఆ జలపాతంలో తడచి తన్మయత్వం చెందు తున్నట్లూ వూహించుకోసాగాడు ముగరాజు.

కానీ వయసు తెచ్చిన వంపు సొంపులకు సరిగా అతకని వారి వంటి మీది దుస్తులు మాత్రం అనంతపురంలో తనతోటల్లుడి ధనియాల పంట భూమిని చుట్టుముట్టిన ఇసుక, పొరలు ... పొరలుగా తన శృంగార హృదయం మీద ఎడారిలా పరుచుక పోతున్నట్లనిపించడంతో తనలో తాను గింజుకొంటూ ''ఇంత బంగారాన్ని ఇంట్లో పెట్టుకొని ఎందుకోయ్ మళ్ళీ వచ్చే పంట కాలం వరకు ఆగమంటావ్'' పెద్దపిల్ల సరోజ వైపు ఆబగా చూస్తూ అన్నాడు.

''అదేంది ముగరాజా! అలాగంటావ్. మహలచ్చుముల్లాంటి నీ కూతుల్లు వనజ, గిరిజలు మేలిమి బంగారం కాదా ఏంటీ'' నెత్తి మీది సంగటి బేసిన్‌ను తనకభిముఖంగా వంగి దించుతూ అన్న సరోజ మాటలు ముప్పై మట్ల బావిలాంటి తన గుండె లోతుల్లో పెద్ద బండరాయి ''గుభేల్లు''!!మని పడ్డట్లనిపించడంతో ముగరాజు కొంటె చూపులకు కనిపించవలసిన అందాలస్థానంలో బాధ్యతలు దర్శనమిచ్చాయి.

రామయ్య ఎద్దుల్నూ, మడకనూ కడిగాక, తనను పంచలోహాల విగ్రహంలా మార్చిన వంటి మీది బురదను శుభ్రపరుస్తున్న నీటి గల గలలలో వారి మాటలు కలిసిపోయాయి.

''అరె ...! నీ పాసునుగాల 'కల్లుకొచ్చి ముంత దాచినట్లు' ఆ ఇసియం ముందుగానే కక్కలేక పోయావా? మా కాలంలో అయితేనా — ఇలాటి జబ్బులు రెండూ కాకపోతే మూడు రోజులు. అంతే

> 'పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణ సంకటం అని సామెత. అంతో ఇంతో అక్షరం ముక్క నేర్చుకున్న వాడు ఆడే అప్పుల చెలగాటానికి ప్రాణ సంకటంలోపడిన ఎలకకూ జ్ఞానోదయమయితే!
>
> తను ఎలక కాదనీ, తనతో చెలగాటమాడడం కుదరదనీ అక్షరాలా నేర్పాలనుకుంటాడు. తను ఎలక కాకపోతే, వాడు పిల్లిగా ఇక వుండడనే.

అబోడా! అడికిమించి సచ్చి సొరగానున్న సిద్దముని వైద్యానికి ఆ జబ్బు ఆగితే సెప్పు! ఇంతవరకూ ఆ బిడ్డకు ఏం సూపించినావో ఏమోగానీ, పీసిని పట్టు బట్టి ఆ బిడ్డకు అగసాట్లు బెట్టకుండా మాంచి డాకటరు దగ్గర సూపించేయి. మల్లా వచ్చే శనగపంట వరకు నువ్వాగబన్లా - నువ్వట్టా ఒకసారి ఊర్లోకెళ్ళి ఒక సుట్టేసి నా ఇంటి దగ్గరకి రా నీ డబ్బులిచ్చేస్తా'' అని, ఆ పూట పొలం పనులకు అర్ధాంతరంగా స్వస్తి చెప్పి ''ఓమ్మే! సంగటి బేసిన్ ఎత్తుకొని ఇంటికి. 'బదాండి నాకు సిన్న పని బడింది'' అని కూతుల్లను కేకేసి ఇంటిదారి బట్టాడు రామయ్య. ముగరాజు అతన్ని అనుసరించాడు.

'నాట్లకు సిద్ధమవుతున్న అద్దంలాంటి మడికయ్యలో నీర్లిగిరిపోతే మల్లా గూడేసి నీల్లు బెట్టాలంటే తాతలు ముత్తాతలు కనబడతారే ఎట్టబ్బా!' అని అనుకొంటున్న రామయ్య కళ్ళముందు లుంగలు చుట్టుకుపోతూ రోదిస్తున్న ముగరాజు భార్య సుశీల రూపం కనబడ్డంతో 'ఆ బిడ్డ ఉసురు నా బిడ్డలకు సుట్టుకోకుండా వుండాలంటే ముగరాజు పనే ముందు సూడాల'' అని నిశ్చయించుకున్నాడు.

''ఈడికేం పనిలేదబ్బా! ఊరికో ఐదేలో పదేలో అప్పిచ్చి, తీసుకొన్న ప్రతి మనిషినీ మారోడోడి మాదిరి కయ్యకాడా కంచం కాడా పట్టుకొని పనులు జరగనీకుండా, తన పనులు సక్కబెట్టుకపోతుంటాడు. మడి పని ఈ రోజుకైనా అయిపోనీకుండా సెనిమాదిరొచ్చి అడ్డపడినాడు. రేపు మల్లా ఏకువ నుంచి అన్నం యాల దాకా బురదలో పొర్లాచ్చి ఎంత సింగారించుకొని కూసుంటే మాత్రం ఏ పెళ్లి కొడుకు సూపులకానుతాను? ఈన్నోట్లో మన్ను గొట్టా! ఈని మూలాన నా పదో పెల్లిసూపులు కూడా సూరెక్కేట్లుందే. నా మాటట్లున్నీ - రామయ్య కూతురికి ఈ సంబంధం కూడా కుదర్లేదని వూరోల్లకు తెలిస్తే - మా నాయనకు ఎన్ని బగిసాట్లు-'' అని అనుకొంటూ చెల్లితో పాటు తండ్రిని అనుసరించింది సరోజ.

***

ఏడు నూర్ల రూపాయలకు వడ్డీ మూడు నూర్లూ కలుపుకొని ఎయ్యి రూపాయలు తీసుకొన్నట్టు పత్రంలో రాసుకొన్న ప్రకారం, ముగరాజు అప్పు తీర్చేసాడు రామయ్య.

మూడు నెలలు గడిచిపోయాయి. తన దగ్గర ముగరాజు పట్టుకెల్లిన కోడిపిల్ల యడపెట్టయింది. కానీ రామయ్యకు పత్రం ఇయ్యలా!

''ఆ జబ్బు మనిషితో ఎన్ని అగసాట్లు బడతాండాడో! నిదానంగా ఇస్తాదులే'' అనుకొనె. ఆరు నెలలు గడిచిపాయ - తన దగ్గర పట్టుకెల్లిన పొట్టేలు పిల్ల కోత కొచ్చింది -

పత్రం అడిగితే ''ఎక్కడో బెట్టేసినా ఎతికిస్తాను'' అనె.

రామయ్య నిజమేగాబోలు అనుకొనె. ఆరద్దల కార్తి పోయి మల్లా ఆరద్దల కార్తి వచ్చె. ఈ సందులో ... మద్దె-మద్దెన - మల్లా ఒక కోడిపిల్లను, ఒక తరుపు దూడను పట్టుకెల్లి కొన్నాళ్లపాటు మేపి మారు బేరాల్లో మాంచి లాభాలు సంపాదించె.

అట్లా! నోరున్న రామయ్య పత్రం గురించి అడిగితే ఏదో ఒకటి సెప్పి నోరు మూయించి, నోరు లేని జీవాలను పట్టుకెల్లి పది నూర్లదాకా లాభాలు సంపాదించుకొండె.

ఈ యవహారం ఇలా నానుతుండగానే, పెద్దపిల్లకు పెల్లి అయిపాయె. కడుపు పండి తీర్థమాడడానికి ఇంటికి రానే వచ్చె.

పత్రం విషయంలో వాళ్ళ నాయన అసమర్థత గురించి సరోజకు తల్లి సెప్పనే సెప్పె. కూతురి దగ్గర చివాట్లు తిని, ఈ సారి ముగరాజు చేత పత్రాన్నేట్లైనా కక్కించాలని నిశ్చయించుకొని బయలుదేరె.

దార్లోనే సెరువు మరవ కాడ ఎదురుబడిన ముగరాజును పత్రం గురించి నిలదీసి అడిగితే-

''దాన్ని గురించి సెబుదామనే నీ కాడికొస్తాండా. బీరువా అంతా ఎతికినా కల్లాలోడా! కనబళ్ళా! పివరికి సెల్లింపులయిన పత్రాలుపడేసే కోల్ల అటకలోని రేకు పెట్లోగూడా ఎతికినా ప్చ...! అక్కడా గనబళ్లా! మళ్లా ఒకసారి ఎతుకుదామనుకొనే లోపల నీ కూతురు పీరసపు మూలుగు వినపడటంతో నాగుండెకలుక్కుమనె.

దాని నీరసం తగ్గాలంటే నీ యింటి పెట్టకోడి పులుసే సరయిన మందనిపించె. అనిపించిందే తడవు ఇట్లా ఎల్లబార్లొచ్చేసినా'' ఒగరుస్తూ వర సలు కలిపి మరీ అడిగినా, రామయ్యకు అది ఎటకారంగానే అనిపించె. పత్రం ఇంట్లోనే బెట్టు కొని ఏసకాలు 'ఏస్తాండాడని నిర్ధారణ అయిపాయ. పత్రం ఇయ్యకుండా ఊరించి, ఊరించి దూది లాంటి మెత్తని మాంసపు కోల్లన్నూ, పొట్టేల్లనూ సీపుగా ఇంకొన్ని పట్టుక్కు పోవాలనే దురాశతో ఈ నక్కజిత్తులు ఏస్తాండాడని తేట తెల్లమయిపాయ. ఇక పరే ఆలోసించబనిలేకపాయె....

''థూ! నీయమ్మ బతుకు....! ఆడకూతురు ఆపదలోవుంది అంటే ఇంట్లో ఆడోల్లనొప్పించి ముత్తైదన మెడలో పసుపుతాడు గట్టి బొట్టుపైన కొదవ బెట్టి గడువు తీరకముందే వడ్డీతో సహా అప్ప సెల్లిస్తే...! కడుపులో ఎంత కుటిలం బెట్టు కొన్నావో! పత్రం పోయిందని బొంకుతావా! కానీ...!కానీ...!! ఏ సట్టం, ఏ సంతా తెలీనోడ్ని గదా అని నీ ఇష్టమొచ్చినట్లు నన్నాడిద్దామను కొన్నావా! ఇంకా ఎన్ని రోజులు ఇలా సాధిస్తావో సూస్తా...!'' వంచన ముందు నీరుగారిపోతున్న నిజాయితీ, ఉక్రోషం రూపంలో రామయ్య చేత ఆమాటలనిపించింది.

''కల్లాలోడా! కల్లు తాగిన కోతిలా ఏందా గెంతులు? పనికి రాని పత్రం కోసం ఎందుకు ఆ మాదిరి బాధపడతావు. అప్పగావాలంటే మల్లా అడుగు ఇస్తా. మనిషిని మనిషి నమ్మాలయ్యా...!'' అన్న ముగరాజు మాటలు రామయ్యకు విన బడింటే 'అప్ప ఇచ్చేటపుడూ, పత్రం రాసుకొనే టపుడూ ఈ ఇసియం నీకు గుర్తుండదట్రా తప్పుడు నాయాలా?' అని, నిలదీసి అడిగిన్లేమో కానీ అప్పటికే రామయ్య ఎనుదిరిగి, చాలా దూరం ఎలిపోయాడు.

* * *

రామయ్య మనసు మనసులో లేదు. బాకీ తీరాక కూడా తన జుట్టు వాని చేతిలో చిక్కుకుపోయిన వైనాన్ని తలుసుకొంటే మనసంతా సెగలు! పొగలు!!

బస్సు అతని మనోస్థితితో ప్రమేయం లేకుండా చిత్తూరు జిల్లా సరిహద్దులు దాటి నెల్లూరు జిల్లాలో ప్రవేశించినా, రామయ్య ఆలోచనలు 'ఆ హద్దులు' దాటి రాలేకపోతున్నాయి.

నెల్లూరులో బస్సుమారి కావలి మీదుగా తన తమ్ముడు రాజన్న, టీచర్‌గా పనిచేస్తున్న మైపాడు తీరంలోని జాలర్ల గ్రామాన్ని చేరుకొన్నాడు రామయ్య.

తాటాకుల కొట్టం క్రింద కూసొని పిల్లోల్లకు వేమన పద్యాలు సెబుతున్న రాజన్న, అన్న రాకను గమనించి పిల్లల్ని ఇంటికి పంపించేసాడు.

మధ్యాహ్నం భోజనాలు అయ్యాక రామయ్య తన పరిస్థితిని వివరించి సెబితే ''నువ్వొత్త అమాయ కుడివి! పత్రం పోతే బోయింది నువ్వు గమ్మునా వుండిపో! పట్టుబట్టి పోరబాట్నగుడా కోర్టు ఏపు ఎల్లద్దు. ఎల్లానో చేతి చమురు ఇంకొంచం ఒదు లుద్దే తప్ప నీకేమీ ఒరగదూ...!వాణ్ణే మరోసారి బతిమాలి సూడు.'' అన్న తమ్ముడి మాటలు మనసులో మంటల్ని మరింత రగిల్చె.

''నువ్వొత్త అమాయకుడివి'' అన్న తమ్ముడి మాటలు సెవుల్లో గింగురు మంటుంటే తలంతా బారమెక్కె.

ఆ రాత్రి అన్నందిన బుద్దిబుట్లా. మనసులో బారాన్ని కాసింతైనా తగ్గించుకొందామని పిండార బోసినట్లున్న ఆ పౌర్ణమి నాటి ఎన్నెట్లో ఒక్కడే మైపాడు సముద్ర తీరానికేసి నడవసాగె.

సముద్రం గాలికి శరీరం సల్లబడినా మనసంతా వేడి ఇసుకతో నిండినట్లు గరుగరుగ్గానే వుండె. ఆ మనసు ఇసుక మీద వెండి కిరణాలను ప్రసరింప చేసిన చంద్ర బింబం అతని ఆలోచనల పొరల్ని ఛేదించుకొని చూపుల్ని ఆకర్షించింది.

చంద్రుని మీదినుండి దిగువన భూమికి సమాంతరంగా చూపులు మరల్చిన రామయ్యకు అతి ''పోటు''ను కలిగించిన చంద్రుని ముంచి వేయడానికి కెరటాలతో ఉవ్వెత్తున లేస్తున్నట్లుగా సముద్రం కనిపించింది.

ఆ భావం మనసులో కలిగిందే తడవు తన మనసులో అసంతృప్తి ''పోటు''ను సృష్టించిన వారిని ఏమి చేయాలో బోధపడినట్లుందతనికి - ఒక్క ఉదుటున లేచి వడివడిగా గ్రామం వేపు నడుచుకెలుతున్న రామయ్య అడుగుల సవ్వడికి, తీరం వెంబడీ వేటసాగిస్తున్న పీతలు భయంతో బొరియల్లోకి చకచకా దూరేసాయి!

అ మరుసటి రోజే తమ్ముడికి మాటైనా చెప్పకుండా తన స్వగ్రామానికి బయలుదేరాడు రామయ్య.

రామయ్య స్వగ్రామం చేరిన పదిరోజుల తరువాత - ముగరాజు ఇంట్లో దొంగలు పడి డబ్బులు ముట్టుకోకుండా పత్రాలు మాత్రం పట్టుకెల్లి పోయారనే వార్త ఆ గ్రామమే కాదు ఆ మండలం లోని ధనవంతుల మనసుల్లో కల్లోలం సృష్టించింది.

పోయినవన్నీ చెల్లింపులు అయిపోయిన పత్రాలైనందున ముగరాజు పోలీస్ రిపోర్ట్ ఇవ్వలేదు. పైగా ''డబ్బులు పోలేదు అది సాలు బగమంతుడా!'' అని మనసులో అనుకొన్నాడు.

కానీ గ్రామస్తుల నోల్లకు ఇదో మంచి రుచికరమైన చర్చనీయాంశం కావడంతో - ఈ పని చేసింది కల్లాల రామయ్యేనని కొన్ని నోళ్ళు, చెవులను కొరికాయి. తరువాత్తరువాత బహిరంగంగానే ఆ విషయాన్ని చర్చించుకొన్నా - ముగరాజు మీద కోపమో!, రామయ్య మీద ప్రేమో!! తెలీదుగానీ ఏ పెద్దమనిషీ మద్దిస్తం బెట్టి 'విషయం' తేల్చడానికి ముందుకు రాకపోయే సరికి, నోళ్ళు తమ నాలుకల్నే కొరుక్కోవడం ప్రారంభించాయి.

రానురాను ఈ సంఘటన గ్రామస్తులకు 'పాతిసయం' అయిపోయినప్పటికీ ఊర్లోకొచ్చే కొత్తోల్లకు కొత్తగానే వుండే.

''అందుకేనేమో ఏమిటీ! ఊర్లో ప్రతి ఒక్కరూ 'కల్లోల రామయ్య! కల్లోల రామయ్య!!' అని నామస్మరణచేస్తున్నారు. ''అదేమన్నా ఎలక్షన్లలో పోటీచేస్తున్న రాజకీయ నాయకుడి పేరా?'' అని ఊరికి కొత్తగా వచ్చిన 'నైటిస్కూలు' టీచర్ ''దేశిస్కూలు' టీచర్‌ని ఆసక్తిగా అడిగాడు.

దానికి జవాబుగా ఒక చిరునవ్వు చిందించి ''మీరనుకుంటున్నట్లు అతను రాజకీయ నాయకుడేమీ కాదు. వంచననే మతంగా చేసుకొని ప్రజల్ని పీడించే వాల్ల మనసుల్లో మాత్రమే ''కల్లోలం'' సృష్టించిన రామయ్య అతను. తోటి కర్షకులకు తన పూర్వీకుల్లాగా అతను పంట కల్లాలు నూర్పిడి చేసే ''కల్లాల'' రామయ్య మాత్రమే'' అని అన్న 'దేశిస్కూలు' టీచర్ మాటలు అర్థం కావడానికి - చీకటిలో గుడ్డాడిలా కాస్సేపు తడుముకోవలసి వచ్చినా, చివరికి బోధ పడినట్లు నిలువుగా తలోమారు ఊపి, తన వృద్ధ శిష్యులకు అక్షరాలు నేర్పించడంలో మునిగి పోయాడు.

ఆ వృద్ధ శిష్యుల గుంపులోనే ఏ కల్లోలమూ పట్టనట్లు నో మూల ప్రశాంతంగా కూర్చొని 'అ' అప్ప, 'ర' రద్దు అనే అక్షరాలను దిద్దు కొంటున్నాడు కల్లాల రామయ్య. ◆

కోరమాండల్
సిమెంట్స్ లిమిటెడ్ వారి భీమ సిమెంట్